ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 14 మే 2025





ఓవర్‌లోడ్‌తో మట్టి తరలింపు

- ట్రిప్పు మట్టికి రూ. 2700
- పరిమాణంతో సంబంధం లేకుండా ధర నిర్ణయం
- ఇటుక బట్టీల యజమానులకు వరంగా మారిన నిబంధనలు
- నారాయణపూర్‌లో ఓవర్‌లోడ్ లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వేసవి కాలం వచ్చిందంటే చాలు.. జిల్లాలో గల ఇటుక బట్టీల యజమానులు, మట్టి మాఫియా కన్ను చెరువుల మట్టిపైనే ఉంటాయి.. నిబంధనలు ఎలా ఉన్నా వాటిని ఎలాగైనా అతిక్రమించి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడమే వారి పని. దీనికి ఈ ఏడాది చెక్ పెట్టాలని భావించిన జిల్లా అధికార యం త్రాంగం టన్నుల లెక్కన గాకుండా ఒక్కో లారీ ట్రిప్పు మట్టికి గంపగుత్తగా రూ.2700 ధర నిర్ణయిం చింది. ఏ ప్రాతిపదికన ఈ ధర నిర్ణయించారే గానీ, ఒక్కో లారీలో ఎంత పరిమాణంలో మట్టి తీసుక పోవాలనే నిబంధన లేకపోవడం ఇటుక బట్టీల యజమానులకు వరంగా మారింది. ఇదే అదునుగా భావిస్తున్న యజమానులు ఓవర్ లోడ్‌తో పెద్ద ఎత్తున మట్టిని తరలించుకు పోతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. ఓవర్ లోడ్ గురించి అధికారులు పట్టించుకోక పోవడంతో కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన బీటీ రోడ్లు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే జిల్లా సరిహద్దులోని రామగుండం మండలం, జమ్మికుంట మండలం వావిలాల నుంచి ఒక్కో లారీలో 40 నుంచి 60 టన్నుల ఓవర్‌లోడ్‌తో లారీలు వస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 140 వరకు ఇటుక బట్టీల పరిశ్రమలు ఉండగా యేటా పెద్ద ఎత్తున చెరువుల మట్టి అవసరం ఉంటుంది. ఇక్కడ తయారయ్యే ఇటుకలకు డిమాండ్ ఉంటుంది. వాటి తయారీకి ఉపయోగించే చెరువుల మట్టికి డిమాండ్ ఉంది. దీనిని ఆసరా చేసుకుని రాజకీయ నాయకులు, ఇటుక బట్టీల యజమానుల పేరిట కొంత పరిమాణంలో అనుమతులు తీసుకుని, పెద్ద మొత్తంలో అక్రమంగా మట్టిని

(మిగతా 8వ పేజీలో)

మట్టి లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

సుల్తానాబాద్ మే 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపూర్‌లో మట్టి తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. నారాయణపూర్‌లోని శనగకుంటకు సంబంధించిన మట్టిని తీసుకుపోవడానికి కలెక్టర్ ఏడుగురు ఇటుక బట్టీల యజమానులకు అనుమతులు ఇచ్చారు. అనుమతుల మేరకు నారాయణపూర్‌లోని కుంట నుంచి 305 లారీల ట్రిప్‌లు తీసుకె ళ్లాల్సి ఉంటుంది. మట్టి తరలింపును సోమవారం సుల్తానాబాద్ ప్రాంతానికి చెందిన ఇటుకల బట్టీల యజమానులు ప్రారంభించారు. మొదటిరోజు 35 ట్రిప్పుల మట్టిని తరలించారు రెండో రోజైన మంగళవారం మరో 25 లారీలలో మట్టిని తరలిస్తుండగా నారాయణపూర్ గ్రామస్థులు అడ్డుకున్నారు. కలెక్టర్ ఇచ్చిన అనుమతుల కన్నా ఎక్కువగా మట్టిని తీసుకు వెళ్తున్నారని ఒక్కో టిప్పర్‌లో 25 టన్నులలోపు తీసుకోవాలని ఉండగా, నలభై టన్నులకు పైగా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తూ అడ్డుకున్నారు. ఉదయం 10 గంటలకు లారీలను అడ్డుకోగా సాయంత్రం రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్ళి గ్రామస్థులకు సర్ది చెప్పారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించడంతో లారీలు తరలివెళ్ళాయి.



ఓవర్‌లోడ్‌తో వెళుతున్న మట్టి లారీలను అడ్డుకున్న నారాయణపూర్ గ్రామస్తులు

అవుట్ సోర్సింగ్ కార్మికుల్లో ఆందోళన

- డిజిగ్నేషన్ తగ్గిస్తూ వివరాలు పంపాలని మున్సిపల్‌శాఖ ఆదేశం
- రామగుండంలో 39 డిజిగ్నేషన్లను 14కు కుదింపు
- వాటర్ సప్లై కార్మికుల వివరాలే లేవు

కోల్‌సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌శాఖ వైఖరితో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులతో సీడీఎంఏ కార్యాలయం మరో వివాదానికి తెర లేపింది. ఇప్పటికే జీవో 69తో కార్మికుల వేతనాలు తగ్గించేలా ఉత్తర్వులు ఇచ్చి అనంతరం యధాతథస్థితి కొనసాగుతుందంటూ సర్క్యూలర్ ఇచ్చింది. అయితే కొత్త వారికి జీవో నెం.69 వర్తిస్తుందంటూ మెలిక పెట్టింది. తాజాగా ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు సంబంధించి వేతనాలు, డిజిగ్నేషన్లను తగ్గిస్తూ ఉద్యోగుల వివరాలు పంపాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం మున్సిపాలిటీల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు ఇప్పటి వరకు రూ.20,500వేతనం ఉండగా ఇప్పుడు రూ.16,600లకే పరిమితం కానున్నది. అలాగే మంచినీటి సరఫరా, ఎలక్ట్రీషియన్లు, ఇతర ఉద్యోగుల వేతనాలు తగ్గనున్నాయి. డిజిగ్నేషన్లు తగ్గడంతో వేతనాల్లో తేడాలు రానున్నాయి.

రామగుండం నగరపాలక సంస్థలో ప్రస్తుతం 39 డిజిగ్నేషన్‌లలో సిబ్బంది పని చేస్తున్నారు. 20 నుంచి 25సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఉన్నారు. సీడీఎంఏ జారీ చేసిన ఆదేశాల్లో డిజిగ్నేషన్ల సంఖ్య 14కు తగ్గించింది. నగరపాలక సంస్థలో ఆటో ట్రాలీ డ్రైవర్లు 63, ట్రాక్టర్ డ్రైవర్లు 23, డంపర్ పేసర్లు 3, ఇతర డ్రైవర్లు 2 మొత్తంగా 91మంది ఉన్నారు. సీడీఎంఏ కార్యాలయం వీరి సంఖ్య 29కే కుదించింది. అవుట్ సోర్సింగ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు 15మంది ఉండగా వీరికి రూ.23,750 వేతనం లభిస్తుంది. కొత్తగా శానిటరీ జవాన్ల పేర 8 మందికి అవకాశం కల్పించి వేతనాన్ని రూ.16,600లకు కుదించింది. జూనియర్ అసిస్టెంట్లు 12మంది ఉండగా వీరి వేతనం రూ.20,500గా ఉంది. కొత్త డాటాలో వీరిని 8మందికి కుదించి వీరి వేతనం రూ.19,500గా చేశారు. బిల్ కలెక్టర్లు 12మంది ఉండగా వీరి వివరాలే లేవు. ఎలక్ట్రీషియన్లు 19మంది ఉంటే 8కి కుదించారు. మంచినీటి విభాగంలో మొత్తం 61మంది కార్మికులు ఉంటే వారి వివరాలేవి కొత్తడాటాలో పొందుపర్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ చేయనున్నదనే ప్రచారం నేపథ్యంలో సీడీఎంఏ కార్యాలయం డాటాను కోరడం ప్రాధాన్యతను సంతరించుకున్నది.



ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే చర్య...

ఏడాదిన్నరగా మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం కార్మికుల వేతనాలు తగ్గిస్తూ జీవోలు జారీ చేస్తుంది. మళ్లీ ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవడంతో సరిదిద్దుతుంది. గతంలో జారీ చేసిన జీవో 1037పై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి సీడీఎంఏ కార్యాలయం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో మళ్లీ సరిదిద్దారు. ఈ ఏడాది జీవో నెం.69ని జారీ చేశారు. దీనిపై కూడా వివాదం నెలకొన్నది. కార్మికుల డాటాను సేకరించే సమయంలో వేతనాలు, డిజిగ్నేషన్లు కుదించడంతో ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

తేడాలపై రిమార్క్స్ రాసి పంపుతాం...

రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ

ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు అడిగిన సందర్భంలో డిజిగ్నేషన్లు కుదించిన విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా. ప్రస్తుతం ఉన్న కార్మికులకు వేతనాల్లో తేడా రాదని చెప్పారు. ఇక్కడి పరిస్థితులపై రిమార్క్స్ రాసి పంపుతాం.

ఆర్థికశాఖ కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే



గోదావరిఖని, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రెటరీగా నియమితులైన సందీప్ కుమార్ సుల్తానియాను మంగళ వారం సచివాలయంలో రామగుండం ఎమ్మె ల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ సుల్తానియాకు రాష్ట్ర ఆర్థిక శాఖ అప్పగిం చడం శుభ పరిణామమని, పారదర్శకతకు, సమర్థతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడే వ్యక్తి అని, గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పని చేశారన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

- జిల్లా వ్యాప్తంగా 2488మందికి 2366మంది హాజరు
- 95 శాతం నమోదు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య

పెద్దపల్లి కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మంగళవారం పాలిసెట్ ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 2488మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 2366మంది విద్యార్థులు హాజరు కాగా 122మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 1336 మంది బాలురకు 1275 మంది, బాలికలు 1091 మందికిగాను 61మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 95 శాతం విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.



ల్యాబ్‌ల్లో విద్యార్థుల ప్రయోగాలు

చదువుల కోవెల మంథని జేఎన్‌టీయూహెచ్

- అందుబాటులో 6 ఇంజనీరింగ్ కోర్సులు
- 1300 మంది విద్యార్థులకు వసతి
- రీజియన్ సెంటర్‌గా గుర్తించిన యూనివర్సిటీ
- సింగరేణి కార్మికుల పిల్లలకు 5, అధికారుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్
- వివిధ రకాల పోటీ పరీక్షల నిర్వహణకు ఆతిథ్యం

7

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వీణవంక, మే13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన కట్కూరి సరేందర్‌రెడ్డి (53) అనే రైతు అప్పుల బాధతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సరేందర్‌రెడ్డి దాదాపు ఐదు ఎకరాలకు పైగా పంటసాగు చేశాడు. పెట్టుబడి కోసం, ఇతర అవసరాలకు ఎనమిది లక్షల వరకు అప్పు చేశాడు. పంట సరిగా రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో మంగళవారం తెల్లవారుజామున పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రొబెషనరీ ఎస్సై సాయి కృష్ణ తెలిపారు.

కోడలు చేసిన అప్పు తీర్చలేక అత్త ఆత్మహత్య

శంకరపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో దొరికినంత అప్పు చేసి కట్టుకున్న భర్తను, కన్న పిల్లలను వదిలేసి వెళ్లింది ఓ వివాహిత. కోడలు చేసిన అప్పు తీర్చలేక కుటుంబ పోషణ భారమై మనస్థాపం చెందిన అత్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టులో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన తీగల రాజేశ్వరి (52) తన కొడుకు రమేష్‌కు రవళితో 13ఏళ్ల క్రితం వివాహం జరిపించింది. వారికి ఇద్దరు కుమారులు రిషి, కృత్విక్ ఉన్నారు. రమేష్ కుల వృత్తి చేసుకుంటూ జీవితం కొనసాగిస్తున్నాడు. కొంత కాలం తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. భార్య రవళి గ్రామంలో కొంత మంది దగ్గర అప్పు చేసి ఆరు నెలల క్రితం రమేష్‌ను వదిలి వెళ్లింది. అప్పటి నుంచి రాజేశ్వరి తన కొడుకు రమేష్, అతని కుమారుల బాగోగులు చూసుకుంటోంది. కోడలు చేసిన అప్పు తీర్చలేక రాజేశ్వరి, కొడుకు రమేష్ ఇబ్బందులు పడేవారు. కాగా ఈ నెల 12న రాజేశ్వరి అమ్మగారి ఊరు హుజూరాబాద్ మండలం ఇప్పల నర్సింగాపూర్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. మంగళవారం ఉదయం కొత్తగట్టు శివారులోని వ్యవసాయ బావిలో రాజేశ్వరి శవమై తేలింది. వ్యవసాయ బావిలో మృతదేహాన్ని చూసిన గ్రామస్థులు రమేష్‌కు సమాచారం అందించారు. తన తల్లి రాజేశ్వరి అప్పుల బాధతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కుమారుడు తీగల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం



మంటలు అంటుకొని దగ్ధమైన ఆయిల్‌పామ్ తోట

కాల్వశ్రీరాంపూర్, మే 13 ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామ శివారులో మంగళవారం మ్యాదరి సతీష్‌కు చెందిన రెండు ఎకరాల ఆయిల్ పామ్ తోట మంటలు అంటుకొని దగ్ధమైంది. మంటల్లో విద్యుత్ మోటార్ల పైపులైన్లు కూడా కాలిపోయాయి. రైతులు వానాకాలం సాగు కోసం వరికొయ్యలను తగలబెడుతున్నారు. ఆ మంటలు చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములకు కూడా వ్యాపిస్తోంది. రైతు వరికొయ్యకాలు అంటుపెట్టడంతో ఆయిల్‌పామ్ తోటతో పాటు మోటార్లు, పైపులైన్లు దగ్ధమయ్యాయని రైతులు పేర్కొన్నారు.

పాడి గేదెలను తరలించిన దుండగులు

శంకరపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో సోమవారం రాత్రి మూడు పాడి గేదెలను దుండగులు తరలించికెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. మొలంగూర్ గ్రామానికి చెందిన తుమ్మ రాజు, మురాతి మొగిలి వారి వ్యవసాయ బావుల వద్ద షెడ్డు నిర్మించుకొని పాడి గేదెలను షెడ్డుల్లో కట్టేశారు. రోజు లాగానే సాయంత్రం తుమ్మ రాజు రెండు పాడి గేదెల పాలు పితికి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో తుమ్మరాజుకు చెందిన రెండు పాడి గేదెలు, అదే గ్రామానికి చెందిన మరాతి మొగిలికి చెందిన మరో పాడి గేదెను దొంగలు తరలించుకెళ్లారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

జగిత్యాల అర్బన్, మే (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో సోమవారం రాత్రి మద్యం సేవించి మత్తులో ఇద్దరి మృతికి కారణమైన నస్పూరి మణిదీప్ అనే వ్యక్తికి నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు జగిత్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలోని కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న నిందితుడు మణిదీప్ సోమవారం విపరీతంగా మద్యం తాగి జగిత్యాల మండలం పోరండ్ల వైపునుంచి కండ్లపెల్లి రోడ్డు గుండా కారులో జగిత్యాలకు వస్తుండగా అదే సమయంలో జగిత్యాల పట్టణానికి చెందిన పాదం రాజశేఖర్ 23 నెలల తన తమ్ముని కూతురును తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని కండ్లపెల్లి రోడ్డులోని తన తోట వైపుకు వెలుతున్నాడు. మద్యం మత్తులో ఉన్న మణిదీప్ అతివేగంగా అజాగ్రత్తగా కారు నడుపుతూ వచ్చి రోడ్డుకు కుడి వైపునుంచి వెలుతున్న రాజశేఖర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రాజశేఖర్, అతని తమ్ముడి కూతురు విత్న్వి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా రాజశేఖర్ అప్పటికే మృతి చెందాడు. విత్న్విని మెరుగైన వైద్యం కోసం మాత శిశు కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సంఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు ఆయన తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి నాలుగు రోజుల జైలు

జగిత్యాల అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో ఆదివారం రాత్రి డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్న సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాకు చెందిన బసంత్ ఠాకూర్ అనే 29 సంవత్సరాల యువకుడు మద్యం తాగి పట్టుబడ్డాడని ట్రాఫిక్ ఎస్సై బి. మల్లేశం తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించగా కోర్టు 4 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

అన్నీ సోషల్ మీడియాలోనే..



● ఇట్లు.. మేము బాగున్నాం..

ఇప్పుడున్న బిజీ లైఫ్ లో బంధువులు, స్నేహితులకు కనీసం ఫోన్లు చేసి యోగ క్షేమాలు తెలుసుకునే సమయం ఉండటం లేదు. ఏదైనా కార్యక్రమంలో కలిసినప్పుడు హాయ్.. బాయ్ అన్నట్లుగా ఉంటుంది. కనీసం పిల్లలు, కుటుంబ పరిస్థితుల గుర్చించి అడిగేవారు.. చెప్పేవారు లేరు. వీరికి స్టేటస్, స్టోరీలు ఒక మాధ్యమంగా మారాయి. ఉదాహరణకు ఏదైనావిహార, శుభకార్యాలు, తీర్థయాత్రకు వెళ్లారంటే అందుకు సంబంధించిన ఏ రోజుకు ఆ రోజు ఫొటోలు సమయంతో సహా కుటుంబ సభ్యులంతా ఉండే ఫొటోలు పోస్టు చేసి ఆనందిస్తున్నారు. ఆ పోస్టులను చూసిన వారు ఫలానా వారు ఫలానా ఊరికి యాత్రకు వెళ్లినట్లు ఉన్నారని వెంటనే గ్రహిస్తారు. మరికొందరు వారికి ఏదైనా చెడు జరిగిందంటే ఉదాహరణకు రోడ్డు ప్రమాదమో లేదా ఇతర ప్రమాదాలు, ఆరోగ్యం బాగాలేక పోయినా వారి స్థితిని తెలియజేస్తే ఇతరుల సానుభూతిని పొందేందుకు పోస్టు చేస్తూ ఉంటారు. పోస్టు చూసిన వారు అయ్యో వారికి ఆరోగ్యం బాగాలేదా అని తెలుసుకుని స్వయంగా వెళ్లడమో లేదా ఫోన్ చేసి పరామర్శించడమో చేస్తున్నారు. జన్మదినం, వివాహ వార్షికోత్సవం, ఇతర విషయాలు స్టేటస్, స్టోరీల్లో పోస్టు చేస్తుండడంతో వారికి తెలిసిన వారు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

చాలా మంది తమ వ్యక్తిగత ప్రతిభ చాటడానికి సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నారు. ఎందులోనైనా వారు ప్రతిభ సాధించి ఉంటే అప్పటికప్పుడు వీడియో తీసి పోస్టు చేస్తున్నారు. ఈ పోస్టును చూసిన వారు అభినందనలతో ముంచెత్తుతున్నారు. దీనివల్ల మానసికానందం పొందుతున్నారు.

- సూక్తులు, విమర్శనాస్త్రాలు
- ఆధ్యాత్మిక సంబంధ విషయాలు
- వ్యక్తిగత ప్రతిభ చాటి చెప్పేందుకు అదే వేదిక
- స్టేటస్‌లు, స్టోరీలతో హల్‌చల్

గణేశ్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానిక్ సోషల్ మీడియా ఇప్పుడు పలు విషయాలకు వేదికగా మారింది. కొందరు ఉదయం లేవగానే సూక్తులు పోస్టు చేస్తారు. మరికొందరు విమర్శనాస్త్రాలు ఎక్కుపెడతారు. ఇంకొందరు రోజును బట్టి ఆధ్యాత్మిక వివరాలు పెడుతుంటారు. వ్యాపార ప్రకటనలకూ ఇదే వేదికను ఉపయోగించుకుంటున్నారు. స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజల జీవనశైలి మారింది. ప్రతి విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకోవడం పెరిగిపోయింది. అందులోనూ స్టేటస్, స్టోరీల్లో బర్త్‌డే నుంచి మొదలుకుని ప్రతి విషయాన్ని పంచుకుంటున్నారు. కొందరు రోజులో నాలుగైదు సార్లైనా స్టేటస్, స్టోరీలు మార్చుతున్నారు. వారు పెట్టిన పోస్టును ఎంత మంది చూశారు? ఎవరైనా ప్రతి స్పందించారా? అని ఆతృతగా వెతుకుతున్నారు.



వ్యాపార ప్రకటనలకు..

వ్యాపారభివృద్ధికి ఇప్పుడు సోషల్ మీడియా ఒక వేదికగా మారింది. అందులో అందరూ ఎక్కువగా చూసే వాట్సాప్ స్టేటస్ ను చాలా మంది వ్యాపారులు తమ వ్యాపారాభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నారు. వ్యాపారం గురించి బ్రోచర్లు ముద్రించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఆయా వస్తువుల వివరాలు, వాటిలోని ఫీచర్లు, ధర గురించి అందులోనే పోస్టు చేస్తుండటంతో చూసిన చాలా మంది వెంటనే సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి వస్తువును కొనుగోలు చేస్తున్నారు.

ఈదురు గాలులతో వర్షం

ఇల్లంతకుంట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో భారీ ఈదురుగాలులకు తోడు వర్షం కురియడంతో నష్టం జరిగింది. చిక్కుడువానిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులతో చింతమడక శంకరయ్య ఇంటికి వేసుకున్న రేకులు లేచిపోయాయి. రేకులపై పెట్టిన రాయి శ్యామలపై పడటంతో గాయాలు అయ్యాయి. గాలులతో మామిడి కాయలు నేలరాలాయి. వెల్జిపూర్ గ్రామంలో ఈదురుగాలులతో పాటు వర్షం పడటంతో ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి నీరు చేరింది. తూకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోయింది. పలు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోసి నెలరోజులు అవుతున్నా లారీల కొరత వల్ల తరలించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



చిక్కుడువానిపల్లెలో లేచిన ఇంటిపైకప్పు

జిల్లెల్లలో లేచిపోయిన ఇంటి పైకప్పు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన గాలివానకు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిచింది. కొద్ది రోజులుగా ధాన్యం ఎండపోసి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్న రైతులకు గాలివానతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లెల్ల గ్రామంలో గాలివానకు రాజయ్యకు చెందిన ఇంటిపైకప్పు లేచిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, బీరువా తదితర సామగ్రి పూర్తిగా దెబ్బ తిన్నాయి. భయంతో ఇంట్లో నుంచి పరుగులు తీశారు.



జిల్లెల్లలో గాలివానకు లేచిన ఇంటి పైకప్పు

సీబీఎస్ఈ నవోదయలో వందశాతం ఉత్తీర్ణత

చొప్పదండి, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయం వందశాతం ఉత్తీర్ణత సాధించింది. 12వ తరగతిలో 500 మార్కులకు పి రుత్విక్‌రెడ్డి 483, ఇ అభిలాష్ 473, సీహెచ్ శ్రీవర్ధన్ 467 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. అలాగే 10వ తరగతిలో వి వశిష్ట యాదవ్ 480, రాజు రాఘవి 477, కె ఫణీం ద్ర 474 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థులతో పాటు సిబ్బందిని అభినందించారు.

తాటి వనం దగ్ధం

శంకరపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గద్దపాకలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని తాటి వనం దగ్ధమైంది. గ్రామ సమీపంలోని గౌడ సంఘ భవనం దగ్గర తాటి వనంలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని తాటి వనం కొంత మేర దగ్ధమైంది. వెంటనే స్థానికులు అక్కడికి మంటలను అదుపు చేశారు.

తల్లి మృతి చెందిందనే మనస్తాపంతో కుమారుడి ఆత్మహత్య

కోరుట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): తల్లి మృతి చెందిందనే మనస్తాపంతో కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో మంగళవారం కుమారుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన టేకి సాయిలు (35) కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో తమ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటూ కూలి పనిచేస్తూ జీవించేవాడు. రెండు నెలల క్రితం సాయిలు తల్లి రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి మృతితో మనస్తాపం చెందిన సాయిలు మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

● హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో, గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో గంజాయి సేవిస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి తాగుతున్నట్లు, అమ్ముతున్నట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలో సుమారు 75 యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వీరందరూ మత్తు పదార్థాల నిషేధంలో కృషి చేస్తున్నారన్నారు. గంజాయి సేవిస్తున్న ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, అట్టి ప్రదేశాలపై ఇక నుంచి పోలీసులు నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి సేవించి, అమ్మిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్ఐలు నరేందర్‌రెడ్డి, యూనస్ అహ్మద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

అఘోరి శ్రీనివాస్‌పై అత్యాచారం కేసు

కరీంనగర్ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాకు చెందిన అఘోరి ఎల్లారి శ్రీనివాస్‌పై కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైంది. ఈ కేసు విషయంలో పోలీసులు గోప్యత పాటించడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అఘోరి శ్రీనివాస్ తనను అత్యాచారం చేసినట్లు కొత్తపల్లి మండలానికి చెందిన ఓ బాధితురాలు ఏప్రిల్ 28న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే రోజు పోలీసులు అఘోరి శ్రీనివాస్‌పై అత్యాచారం కేసు నమోదు చేశారు. శ్రీనివాస్ ఫోన్‌ద్వారా పరిచయమైనట్లు, గడేడాది నవంబరులో కలిసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఆ తరువాత కొత్తపల్లి దేవాలయం వద్ద తనతో అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. అనంతరం తనను కొండగట్టు హనుమాన్ దేవాలయం తీసుకెళ్లి వివాహం చేసుకున్నట్లు, 3 లక్షల రూపాయలు కూడా తీసుకున్నట్లు పేర్కొంది. ఈ కేసులో నిందితుడు శ్రీనివాస్‌ను ఈ నెల 8న హైదరాబాద్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీటీ వారెంట్‌తో కోర్టులో హాజరుపరిచినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఇల్లంతకుంట, మే 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు మద్యం తాగివచ్చి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం నర్సక్కపేట గ్రామానికి చెందిన బోళ్ల బాల్‌రెడ్డి మంగళవారం దరఖాస్తుదారు వెంట వచ్చి పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. బాల్‌రెడ్డికి డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేయగా మద్యం తాగినట్లు వచ్చిందన్నారు. ఇతనిపై గతంలోనూ మూడు కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

జమ్మికుంట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారిపై ఉన్న తులంన్నర బంగారం, ఐదు తులాల వెండి, హుండీ పగులగొట్టి రూ.8వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం అధ్యక్షులు ఒల్లాల రాజభాస్కర్, పల్లెర్ల కొంరయ్య తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

కోనరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో మంగళవారం రాత్రి పిడుగుపాటుతో ఆవు మృతి చెందగా పక్కనే ఉన్న ఇల్లు ధ్వంసం అయింది. మరిమడ్ల గ్రామానికి చెందిన అక్కనపెల్లి రమేష్ చెందిన పశువు పిడుగుపాటుతో మృతి చెందగా పక్కనే ఉన్న అక్కనపల్లి శంకరయ్య ఇల్లు ధ్వంసం అయింది.

వివాహిత అదృశ్యం

గంగాధర, మే 13(ఆంధ్రజ్యోతి): ఉప్పరమల్యాలకు చెందిన కనకట్ల శిరీష(26) అదృశ్యమైనట్లు గంగాధర ఇంచార్జి ఎస్ఐ స్వాతి తెలిపారు. ఈ నెల 10న ఆమె భర్త మహేశ్‌తో గొడవ జరిగిందని, ఆ మరుసటిరోజు గంగాధరకు వెళుతున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన శిరీష తిరిగి ఇంటికి రాలేదు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): భార్యపై అత్యాచారయత్నం.. తప్పు చేసిన వాడే పంచాయతీ పెద్దల ముందు అవమానకరంగా మాట్లాడడంతో తీవ్ర మనస్థాపానికి గురై తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన కడమంచి స్వామి(34) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం.. తన భర్త స్వామి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం అదే గ్రామానికి చెందిన టేక్ ప్రేమ్ కుమార్ కారణం అని భార్య స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమ్‌కుమార్ తనపై అత్యాచారయత్నం చేయబోయాడని తన భర్త స్వామితో కలిసి స్వరూప కుల పెద్దలను ఆశ్రయించింది. ఈ సంఘటనపై కుల పెద్ద మనుషులు ప్రేమ్‌కుమార్ తప్పు చేశాడని నిర్ధారించి జరిమానా విధించారు. దీంతో కుల పెద్ద మనుషుల ముందు తన భర్త స్వామిని అవమానకరంగా చావుపోరా అంటూ అసభ్య పదజాలంతో తిట్టడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని ప్రేమ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సన్న ధాన్యం కొనుగోలు చేయాలి



రోడ్డుపై బైఠాయించిన రైతులు

తంగళ్లపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లు తూకం వేయడం లేదని, నెల రోజుల క్రితం విక్రయించిన ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతులు సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లడుతూ నెలరోజుల క్రితం విక్రయించిన ధాన్యం డబ్బులు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. సన్న వడ్లను తూకం వేయడం లేదని, రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తున్నామన్నారు. వర్షం భయంతో ఆందోళన చెందుతున్నామని వెంటనే సన్న వడ్లను కొనుగోలు చేసి ఖాతాల్లో డబ్బులు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లెల్ల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాచిరెడ్డి రవి, మాజీ సర్పంచ్ మాట్ల మధు, మాజీ ఎంపీటీసీ చెన్నమనేని వెంకటరావు, ప్యాక్స్ మాజీ చైర్మన్ పబ్బతి విజయేందర్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ అబ్బాడి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

● కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్

కరీంనగర్ క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభంప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి గతంలో కేసులు నమోదైన ట్రాక్టర్, లారీ యజమానులు, డ్రైవర్లపై నిఘా పెట్టామని తెలిపారు. దొంగతనంగా ఇసుకను రవాణా చేసి, కరీంనగర్, ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను విక్రయించిన వారితోపాటు కొనుగోలుదారులపై కూడా కేసులు నమోదు చేస్తామని, జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అనుమతి లేని ఇసుకను భవన నిర్మాణదారులు కొనుగోలు చేయవద్దని సూచించారు.

● ఇసుక అక్రమ రవణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎలగందల్‌లో ఇసుక అక్రమ రవాణా-చట్టపరమైన చర్యలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానేరు పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొనుగోలు చేయవద్దన్నారు.



ఇసుక అక్రమ రవాణాపై మాట్లాడుతున్న కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

వేర్వేరు చోట్ల రెండు లారీలు బోల్తా

ధర్మపురి, మే 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల మూల మలుపు వద్ద ఏపీ 27 టీఎక్స్ 6399 అనే లారీ మంగళవారం మధ్యాహ్నం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ బోల్తా పడిన సమయంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం.

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మంగళవారం ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ నుంచి లారీ మక్కల లోడ్‌తో కర్నూల్ జిల్లా బళ్లారికి వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మూల మలుపు వద్ద బోల్తా పడింది. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తెల్లవారు జామున రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా రెండు రోజుల క్రితమే బస్టాండ్ సమీపంలో గ్రానైట్ లారీ షాపులోకి దూసుకెళ్లిన సంఘటన మరవకముందే మరో లారీ బోల్తా పడడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

'శాతవాహన' లా కళాశాలకు

బార్ కౌన్సిల్ ఆమోదం

- ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభం
- ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి



లా కళాశాల అనుమతి కోరుతూ కేంద్ర మంత్రి అర్జున్‌మేఘ్వాల్‌ను కలిసిన బండి సంజయ్‌కుమార్, సునీల్‌రావు, వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ (ఫైల్)

కరీంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో లా కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నారు. 2025-26 సంవత్సరంలో ఎల్ఎల్‌బీ కోర్సు ప్రారంభం కానున్నది. మొదటి సంవత్సరం 120 మందికి అడ్మిషన్లు ప్రారంభించనున్నారు.

● బండి సంజయ్ చొరవతో.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ లా కళాశాల కోసం చేసిన కృషి ఫలించింది. కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో లా (న్యాయ) కళాశాల మంజూరు కోసం కృషి చేశారు. శాతవాహన యూనివర్సిటీలో లా కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ వీసీ ఉమేష్‌కుమార్ కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్, మాజీ మేయర్



సునీల్‌రావును తీసుకుని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి వినతి పత్రం అందించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయమై వర్చువల్‌గా శాతవాహన యూనివర్సిటీని తనిఖీ చేసి వివరణాత్మక నివేదికను అందించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వినతికి స్పందించిన న్యాయ శాఖమంత్రి 2025-26 సంవత్సరం నుంచే లా కళాశాలకు అనుమతికి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్‌తో పాటు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

● మరిన్ని అభివృద్ధి ఫలాలు: మాజీ మేయర్ సునీల్‌రావు

కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కృషి ఫలితంగానే శాతవాహన యూనివర్సిటీ లా కళాశాలకు అనుమతి లభించింది. జిల్లా ప్రజలకు, విద్యార్థులకు లా కళాశాల గర్వకారణమన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో మరిన్ని అభివృద్ధి ఫలాలు తెచ్చేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

చదువుల కోవెల..

మంథని జేఎన్‌టీయూహెచ్



అందుబాటులో 6 ఇంజనీరింగ్ కోర్సులు

13 వందల మంది విద్యార్థులకు వసతి

రీజియన్ సెంటర్‌గా గుర్తించిన యూనివర్సిటీ

సింగరేణి కార్మికుల పిల్లలకు 5, అధికారుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్

వివిధ రకాల పోటీ పరీక్షల నిర్వహణకు ఆతిథ్యం..

మంథని/రామగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు మంథని జేఎన్‌టీయూహెచ్ కళాశాల 2010లో రామగిరి మండలం సెంటినరీకాలనీలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసేందుకు సింగరేణి అధికారులు సంస్థ స్థలాన్ని కేటాయించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరంలో మంథని వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో సుమారు 60 ఎకరాల్లో అన్ని వసతులు కల్గిన జెఎన్‌టీయూహెచ్ కళాశాల విజయవంతంగా కొనసాగుతోంది.

అందుబాటులో 6 ఇంజనీరింగ్ కోర్సులు..

కళాశాలలో 6 ఇంజనీరింగ్ కోర్సుల్లో విద్యాబోధన కొనసాగుతుంది. వాటిలో మైనింగ్, మెకానికల్, సీఎస్‌సీ, ఈఈఈ, సివిల్, ఏఐఎంఎల్ ఇంజనీరింగ్ విభాగాల్లో విద్యార్థులకు కోర్సులు బోధిస్తున్నారు. ప్రతీ విద్యా సంవత్సరంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా మెకానికల్, సీఎస్‌సీ, ఈఈఈ, సివిల్ విభాగాల్లో ఒక్కో కోర్సులో 60 మంది చొప్పున, మైనింగ్‌లో 30 మంది విద్యార్థుల చొప్పున యేటా 360మంది విద్యార్థులు కొత్తగా చేరుతున్నారు.

సింగరేణి కార్మికులు, అధికారుల పిల్లలకు 10 శాతం రిజర్వేషన్..

కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని, భవన నిర్మాణాలకు సీఎస్ఆర్ నిధులను కేటాయించిన సింగరేణి సంస్థ తమ భవిష్యత్ ఇంజనీరింగ్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సును ప్రవేశ పెట్టాలని భావించింది. విద్యా బోధన జరిగే ఆరు కోర్సులలో సంస్థలో పని చేస్తున్న కార్మికుల పిల్లలకు 5 శాతం, అధికారుల పిల్లల కోసం 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని యూనివర్సిటీ నుంచి ప్రత్యేక అనుమతులు పొందారు. యేటాఐదు కోర్సులో జరిగే కౌన్సెలింగ్‌లో సింగరేణి సంస్థలో పని చేస్తున్న వారి పిల్లలు రిజర్వేషన్‌పై వివిధ కోర్సులో ప్రవేశాలు పొందుతున్నారు.

విద్యార్థులకు వసతులతో కూడిన భవనాలు..

సువిశాలమైన కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని విభాగాలకు హెచ్‌వోడీలు, లెక్చరర్లు, ల్యాబ్ ఇన్‌చార్జిలు, పీడీ అందుబాటులో ఉన్నారు. మొదట సింగరేణి సంస్థ విడుదల చేసిన నిధులతో కళాశాల అకాడమిక్ బ్లాక్, బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్ భవనాల నిర్మాణాలు పూర్తి చేశారు. జేఎన్‌టీయూహెచ్ సమకూర్చిన నిధులతో పరిపాలన విభాగం, లైబ్రరీ, ల్యాబ్, గెస్టుహౌస్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. తాజాగా అకాడమిక్ బ్లాక్-2 భవన నిర్మాణం పూర్తయింది. అన్ని వసతులు, సౌకర్యాలతో కూడిన వేర్వేరు హాస్టల్ భవనాల్లో 1300 మంది విద్యార్థులు నివాసం ఉంటున్నారు. తాజాగా మరో హాస్టల్ బిల్డింగ్ కూడా అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా మారింది.

కళాశాల నుంచి రీజియన్ సెంటర్‌గా గుర్తింపు..

మంథని జెఎన్‌టీయూహెచ్ కళాశాలలో సదుపాయాలను గుర్తించి యూనివర్సిటీ కళాశాలకు రీజియన్ సెంటర్‌గా ప్రత్యేక గుర్తింపునిచ్చింది. గతంలో రిజియన్ సెంటర్ పరిధిలోని పెద్దపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన 12 సెంటర్‌ల (కళాశాలలు) సంబంధించిన విద్యార్థులు ఇక్కడే పరీక్షలకు హాజరు కావాల్సిన అవకాశాన్ని యూనివర్సిటీ కల్పించింది. వీటితోపాటు వివిధ రకాల ఉద్యోగాల నియామకాల పోటీ పరీక్షలకు వేదికగా నిలుస్తోంది.

ఏఐసీటీఈగా కళాశాలకు ప్రత్యేక గుర్తింపు..

2018 మే 16న జేఎన్‌టీయూహెచ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు ద్వారా కళాశాలలో కొత్త కోర్సులకు, బ్రాంచ్‌లకు, ఎంటెక్ విద్యకు అనుమతి లభించింది. యూనివర్సిటీ గ్రాంట్‌లో కళాశాలకు నేరుగా నిధులు వచ్చే వెసలుబాటు ఉంటుంది.

ఎన్నికల స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ సెంటర్‌గా

మంథని అసెంబ్లీ, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు విశాలమైన జేఎన్‌టీయూ కళాశాల భవనాలను స్ట్రాంగ్ రూంలుగా, కౌంటింగ్ కేంద్రంగా వినియోగించుకుంటున్నారు. సువిశాలమైన భవనాలు, స్థలం, రక్షణగా ఉండడంతో అధికారులు కళాశాలను ఎన్నికల నిర్వహణకు అధికారులు వినియోగించుకున్నారు.







జేఎన్‌టీయూహెచ్ కళాశాల భవనాలు, ల్యాబ్‌ల్లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

గణేశ్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఈడీపీ(అప్రెంటిస్ ఎంబీడెడ్ డిగ్రీ ప్రోగ్రాం)లో భాగంగా బీఎస్‌ఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బీకాం- బీఎస్ఎఫ్ఐ (బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ సర్వీస్ ఇన్సూరెన్స్) కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో అల్ఫోర్స్ ప్రభంజనం



సీబీఎస్ఈ 10వ తరగతి టాపర్లతో కలిసి విజయ సంకేతం చూపుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, మే 13(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ ప్రభంజనం సృష్టించింది. జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులతో అల్ఫోర్స్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడారు. చక్కటి ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలను సాధించడం అల్ఫోర్స్‌కే సాధ్యమవుతుందన్నారు. పాఠశాల ప్రారంభించిన నాటినుంచి జాతీయస్థాయి మార్కులతో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నామని, అగ్రగామిగా నిలుస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన వివిధ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ఉత్తమ స్థానంలో నిలుస్తున్నారన్నారు.

● 10వ తరగతి ఫలితాలు

మహ్మమద్ షాజ్‌నీన్ తబస్సుమ్ 99.4 శాతం(497మార్కులు)తో జిల్లా స్థాయిలో అగ్రస్థానంలో నిలించిందని విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎం.సుచీత్ రెడ్డి 98.6శాతం(493), జె.సుప్రభ 98.4(492), ఆర్. వేదిక, టి.హర్షిణి 98.2 శాతం (491), డి.హర్షిత్ 489, బి.ఆకృతి, సీహెచ్ అనీష్‌కుమార్, గయాసుద్దీన్ 488 మార్కులు సాధించారు. ఎ.నక్షత్ర, పి.శ్రీవర్షిత, కె.నక్షత్రరెడ్డి 486, ఎస్.శాలిని, అబ్దుల్ రఫీ 484, డి.వివేక్ 483, టి.హర్షవర్ధన్, ఈ.ప్రణీత్‌రెడ్డి 482, ఆర్య, కె.విశ్వజరెడ్డి 481, రమేష పాతిమా, టి.అబిరామ్‌రెడ్డి 480 మార్కులతో ప్రతిభ కనబరిచారు.

● 12వ తరగతి ఫలితాలు

వి.సంజీతరెడ్డి 96.4శాతం (482మార్కులు), ఎస్.అనిరుధ్‌సాయి 96.4 (482), వి.శశాంక్‌రెడ్డి 95.6శాతం(478), జె.నమిక 94.6శాతం(473), ఈ. మృణాళిని 94.6 శాతం(473), అబ్దుల్‌హక్ 92.2శాతం(461), టి.సాయి విఘ్నేష్ 92.2శాతం(461), డి.శ్రీహాస్‌కౌశిక్ 92శాతం(460), ఎస్.మైత్రేయి 91.2శాతం(456), 13 మంది విద్యార్థులు 90శాతం మార్కులు సాధించి జిల్లా స్థాయిలో నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీబీఎస్ఈ 12వ తరగతి టాపర్లను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి

రాజన్న ఆలయ మూసివేతపై

వదంతులు నమ్మవద్దు

- ఆలయ ఈవో వినోద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఈవో కె.వినోద్‌రెడ్డి

వేములవాడ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయం జూన్ 15వ తేదీన మూసివేస్తారని వస్తున్న వదంతులను నమ్మవద్దని రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. ఆలయ ఆవరణలోని ఓపెన్ స్లాబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ విస్తరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, ఆలయ అర్చక బృందం శృంగేరి పీఠాధిపతిని నాలుగు సార్లు కలిసి ఆలయ విస్తరణపై పలుమార్లు చర్చలు జరిపి అనుమతులు పొందారన్నారు. ఆలయ విస్తరణ పనులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.76 కోట్లు కేటాయించిందన్నారు. ఆలయ విస్తరణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. రాజన్న ఆలయం జూన్ 15వ తేదీన మూసివేసి భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేస్తారని సోషల్ మీడియా వేదికగా వదంతులు వస్తున్నాయని, అవన్నీ భక్తులు నమ్మవద్దన్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా అర్చకులు, శృంగేరి పీఠాధిపతి అనుమతుల మేరకు తగిన సమయం చూసి భీమేశ్వరాలయంలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిన అనంతరం రాజన్న ఆలయ విస్తరణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ, నమిలికొండ ఉమేశ్‌శర్మలు మాట్లాడుతూ ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా చరిత్ర కలిగిన విగ్రహాలను కదిలించడం లేదన్నారు. మంచి ముహూర్తం నిర్ణయించిన తర్వాత శృంగేరి పీఠాధిపతుల అనుమతుల మేరకే భక్తులకు భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేస్తారన్నారు.

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేములవాడలోని బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిట లాడింది. భక్తులు భారీ సంఖ్యలో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు రాజన్న ఆలయ హుండి లెక్కింపు: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ హుండీ లెక్కింపును బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



బోనాలతో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

సరస్వతీ పుష్కరాలకు

పకడ్బందీ ఏర్పాట్లు

- భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మహదేవపూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం నుంచి కాళేశ్వరం సంగమం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తరఫున అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు, చేస్తున్న ఏర్పాట్లపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఈ ప్రాంత ఎమ్మెల్యేగా గర్వ పడుతున్నా..

పవిత్రమైన త్రివేణి సంగమం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం నా నియోజకవర్గంలో ఉన్నందుకు గర్వపడుతున్నా. ఇంత పవిత్ర ఆలయ అభివృద్ధిలో, సేవల్లో మా కుటుంబం మొత్తం ముందుంటుంది. మా తండ్రి దుద్దిళ్ల శ్రీపాదరావు ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఈ ప్రాంతంతో పాటు ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే మా లక్ష్యం.

పుష్కర స్నానం ఎంతో పుణ్యం..

పుష్కర స్నానం చేస్తే ఆయురారోగ్యాలతో పాటు సకల పాపాలు తొలగి పుణ్యం దక్కుతుందని వేద పండితులు, అర్చకులు, స్వాములు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మొదటిసారి సరస్వతీ పుష్కరాలు వచ్చాయి. ఈ క్రమంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకు ప్రభుత్వం నుంచి 25 కోట్ల రూపాయలు కేటాయించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహకారంతో ఎన్నడూ లేని విధగా గోదావరి ఒడ్డున సరస్వతీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల విడిది కోసం టెంట్ సిటీ, స్నానపు గదులు, తాగునీటి వసతి, చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. పీఠాధిపతుల కోసం ప్రత్యేక విడిది ఏర్పాటు చేశాం. సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తాం.

గంగా హారతి లాగే గోదావరి హారతి..

ప్రయాగలో 12 రోజుల పాటు గంగా హారతి నిర్వహించినట్టుగానే కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పుష్కరాల సమయంలో గోదావరి హారతి వేద పండితులు, బ్రాహ్మణోత్తములతో నిర్వహిస్తాం. మొదటి రోజు గోదావరి హారతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. గోదావరి మాతకు చీర, సారె, పసుపు కుంకుమ అర్పించి పూజలు నిర్వహిస్తారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

పుష్కరాల్లో విపత్తు బృందాల సేవలు

సర్వసతీ పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సేవలందించనున్నాయని, ఎన్డీఆర్ఎఫ్ నుంచి 34 మంది, ఎస్డీఆర్ఎఫ్ నుంచి 66 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి కాళేశ్వరంలో వీఐపీ ఘాట్, సరస్వతీ మాత విగ్రహం, త్రివేణి సంగమం, గోదావరి ఘాట్, దేవాలయం, బందోబస్తు ప్రణాళిక తదితర రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి పుష్కర సందర్భంగా భక్తులకు అత్యుత్తమైన భద్రత, అత్యవసర సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సరస్వతీ పుష్కరాలకు కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు

పెద్దపల్లి/భగత్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతున్నామని ఆర్టీసీ కరీంనగర్ ఆర్ఎం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని నుంచి 10 బస్సులు నడుస్తాయని, ఇక్కడి నుంచి పెద్దలకు 150, పిల్లలకు 80 రూపాయలు, మంథని నుంచి 10 బస్సులు నడుస్తాయని, ఇక్కడి నుంచి పెద్దలకు 140, పిల్ల లకు 70 రూపాయలు, కరీంనగర్ నుంచి 30 బస్సులు నడుస్తున్నాయని, ఇక్కడి నుంచి పెద్దలకు 280, పిల్లలకు 140 రూపాయలు చార్జీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం రాజు కోరారు.



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లు

త్రిదళం.. త్రినయనం.. త్రివేణి సంగమం..

నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు


మహదేవపూర్, మే 14 (ఆంధ్ర జ్యోతి): కాళేశ్వర త్రివేణి సంగమం అంటే మూడు నదులు (గోదావరి, సరస్వతి, ప్రాణహిత) సంగమ స్థలం. త్రివేణిలో స్నానం చేస్తే సర్వ పాపాలు తొలగిపోయి పూర్వ జన్మ నుంచి విముక్తి లభిస్తుందని నమ్మకం. పరమ శివుడికి బిల్వదళం అంటే మహా ప్రీతి. ఈ నెల 15 నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు జరుగనున్నాయి. గోదావరి, ప్రాణహిత నదులతో కలిసి అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్నందున కాళేశ్వరం త్రివేణి సంగమంగా ప్రఖ్యాతి చెందింది. విశ్వావసు నామ సంవత్సర వైశాఖ బహుళ తదియ 15వ తేదీ గురు వారం ఉదయం 5.40 గంటలకు వృషభ లగ్నం మిథునరాశిలో బృహస్పతి ప్రవేశంతో సరస్వతీ పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రారంభ కార్యక్రమం లో పీఠాధిపతులు గురు మాధవానంద సరస్వతి స్వామి, మాధవానందస్వామి చేతుల మీదుగా జరగనుంది. 12రోజుల పాటు సాయంత్రం 5 నుంచి ఏడు గంటల వరకు ఆధ్యాత్మికవేత్తలతో ప్రవచనాలు, 7 నుంచి 8 గంటల వరకు త్రివేణి సంగమం వద్ద కాశీ పండితులతో నదీ హారతి, రాత్రి 8 నుంచి 9.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం
మహేష్, ఆలయ ఈవో



పుష్కరాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక కృషితో ఈసారి పుష్కరాలను భారీగా నిర్వహిస్తున్నాం. సెట్టింగ్‌లు, సరస్వతీ విగ్రహం, టెంట్ సిటీ, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

15వ తేదీ ఉదయమే పుష్కరాలు ప్రారంభం
పనకంటి నగేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు



బృహస్పతి మిథేనరాశిలోకి వచ్చినప్పుడు సరస్వతి పుష్కరాలు నిర్వహిస్తారు. 14వ తేదీ రాత్రి 10.35 గంటలకు మిథునరాశిలో బృహస్పతి ప్రవేశిస్తుండగా.. సుర్యాస్తమయం తర్వాత పుష్కర ఆవాహన చేయకూడదు కాబట్టి 15వ తేదీ గురువారం ఉదయం ఉదయం 5.44గంటలకు పుష్కరాలను ప్రారంభిస్తాం.

పెద్దపల్లి పట్టణంలో
అగ్ని ప్రమాదం

పెద్దపల్లిటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్న మసీదు ఏరియాలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పేపర్ ప్లేట్ తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకొని సుమారు 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. మిషనరితో పాటు పేపర్ ప్లేట్ల మెటిరియల్ పూర్తిగా కాలి పోయింది. స్థానికుల సమాచారంతో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మన్‌రావులు ఘటన స్థలికి చేరుకొని మంటలు ఆర్పే చర్యలు తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

ఓవర్‌లోడ్‌తో మట్టి తరలింపు

(5వ పేజీ తరువాయి)

తరలించుకు పోతున్నారు. ఈ ఏడాది కేవలం ఇటుక బట్టీల యజమానులకే మట్టి తరలింపునకు అవ కాశం ఇస్తుండగా, క్రమంగా బట్టీల యజమానుల పేరిట రాజకీయ నాయకులు మట్టిని తరలించుకు పోయే అవకాశాలు లేకపోలేదు.

● **ఒక్కో టన్నుకు రూ.72.80**

గనులు, భూగర్భ శాఖ నిబంధనల ప్రకారం మట్టి తరలించేందుకు అనుమతులు పొందే వాళ్లు టన్నుకు రూ.72.80 ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సి ఉంటుంది. సీనరేజీ పన్నుల కింద 20, పర్మిట్ ఫీజు 16, డీఎంఎఫ్‌టీ (30 శాతం) 6 రూపాయలు, ఎస్‌ఎంఈటీ 40 పైసలు, ఐటీ 40 పైసలు, విలేజ్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద 15, అడ్మినిస్ట్రేషన్ ఖర్చుల కింద 15 రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గనులు భూగర్భ శాఖాధికారులు ఇచ్చిన అనుమతుల మేరకు చెల్లించిన తర్వాతనే మట్టి తవ్వకాలకు అనుమతులు ఇస్తారు. మట్టి తరలింపును ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకే తరలించాలని, ఓవర్‌లోడ్‌తో తరలించకుండా, దారి వెంబడి మట్టి పడకుండా ఉండేందుకు లారీలపై కవర్లు కప్పాలనే నిబంధనలు విధిస్తారు. యేటా నిబంధనలను ఉల్లంఘిస్తూ వచ్చారు. గోరం త అనుమతులు తీసుకుని కొండంత మట్టిని రాజ కీయ నాయకుల అండదండలతో తరలించుకు పోయారు. ఈ ఏడాది జిల్లాలో మొదట 14 చెరు వుల్లో మట్టిని తరలించుకు పోవచ్చని గుర్తించారు. ఆ తర్వాత మరిన్ని చెరువులను గుర్తించారు.

● **305 ట్రిప్పులకు అనుమతులు..**

సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో గల శనగకుంటలో 305 ట్రిప్పుల లారీల మట్టిని తరలించుకు పోయేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈనెల 9న ఏడుగురు ఇటుక బట్టీల యజమానులకు ప్రొసీడింగ్స్ నంబర్. సీ2/270/2025-5అనుమతులు ఇచ్చారు. సోమవారం 35 లారీల ట్రిప్పుల మట్టిని తరలించారు. మంగళవారం మరో 25 లారీల్లో మట్టిని తరలిస్తుండగా, ఓవర్‌లోడ్‌తో మట్టిని తీసుక పోతున్నారని గ్రామస్థులు అడ్డుకున్నారు. మట్టిని లోడ్ చేస్తున్న లారీ నంబర్‌పై రెవెన్యూ సిబ్బంది వేబిల్లును ఇస్తున్నారు. అందులో ఒక ట్రిప్పు అని మాత్రమే పేర్కొంటున్నారు. ఎంత పరిమాణంలో మట్టిని తీసుక పోతున్నారనే అంశం లేదు. ఇదే అదునుగా భావిస్తున్న ఇటుక బట్టీల యజమానులు ఒక్కో లారీలో 40 నుంచి 50 టన్నుల మట్టిని తరలించుకు పోతున్నారని గ్రామస్థులు తెలిపారు. చెరువుల మట్టి అనుమతుల కోసం కలెక్టర్ కార్యాలయంలో ఇటుక బట్టీల యజమానులు క్యూ కట్టారు. ఈ విధానం ఇలాగే అమలు చేస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశాలున్నాయి.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

పెద్దపల్లి కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించే విధంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. జిల్లాలో ఐదు రోజులపాటు జరిగే ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్నాయి. శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి మాధవి హాజరై మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల రాఘవాపూర్, జిల్లా పరిషత్ పాఠశాల గర్రెపల్లిలో జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం.షేక్, ఎంఈవో సురేందర్‌కుమార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ, డీఆర్‌పీలు, సీఆర్‌పీలు, ఎంఐఎస్, సీసీవో పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహం పాక్షికంగా ధ్వంసం

మంథని, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి డివైడర్ పై ఉన్న తెలంగాణ సాయుధ పోరాట నారీ చాకలి ఐలమ్మ విగ్రహం రోడ్డు ప్రమాదంలో మంగళవారం పాక్షికంగా ధ్వంసమైంది. పాత ఇనుము, ప్లాస్టిక్ లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ సీసీ కెమెరా వైర్‌కు తగలడంతో వైర్ విగ్రహం చేయికి తగిలి మోచేయి వరకు విరిగి కింద పడింది. స్థానికులు, పోలీసులు, రజక సంఘం నేతలు పరిశీలించారు. ట్రాలీ యాజమాని పీటపీతో తిరిగి మరమ్మతు చేయించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఐఐహెచ్‌టీలో ప్రవేశానికి వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చేనేత జౌళిశాఖ ఉప సంచాలకులు కే.విద్యాసాగర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఒడిశాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హేండ్లూమ్ టెక్నాలజీలో రాష్ట్రానికి 9సీట్లు కేటాయించారన్నారు. మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, దరఖాస్తులను సహాయ సం చాలకులు కరీంనగర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

నృసింహస్వామిని దర్శించుకొన్న ఎమ్మెల్యేలు



ఆలయంలో పూజలో పాల్గొన్న లక్ష్మణ్‌కుమార్, విజయరమణారావు

ధర్మారం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఖిలావనపర్తి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులతో పాటు దేవాలయ చైర్మన్ పోలుదాసరి సంతోష్, ఈవో కాంతారెడ్డిలు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రైతులను, ప్రజలను చల్లగా చూడాలని ఆకాంక్షించారు.

ఖిలావనపర్తి నృసింహస్వామిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపిపి ముత్యాల కరుణశ్రీ, ఆవుల లత, శ్రీనివాస్, పాకాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతరలో మజ్జిగ పంపిణి

ఖిలావనపర్తి లక్ష్మీనృసింహస్వామి జాతరలో పిరమిడ్ స్పిర్చువల్ సొసైటి బ్రహ్మర్షి పత్రిజీ ధ్యాన మండలి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఏసీపి జి.క్రిష్ణ హాజరై భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. జాతరకు వచ్చిన భక్తులకు ధ్యాన మండలి కరపత్రాలను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు ఎలగందుల అశోక్ తెలిపారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణ్, మాస్టర్ డిల్లేశ్వర్ రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపిపి కొడారి అంజయ్య, ఏఎంసీ మాజీ చైర్మెన్ కొత్త నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

కళ్యాణ్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి ఈ నెల 15 నుంచి 26వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. రోజు పది స్పెషల్ బస్సులతో 30 ట్రిప్పులు నడపుతున్నామని, ఆర్‌టీసీ బస్సులు మాత్రమే పుష్కర ఘాట్ దగ్గర వరకు వెళతాయని చెప్పారు. వివరాలకు గోదావరిఖని బస్‌స్టేషన్ ఎంక్వైరీ నెంబర్ 9441335701లో సంప్రదించాలని కోరారు.

మంథని: సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వర క్షేత్రానికి వెళ్ళే భక్తుల కోసం మంథని బస్టాండ్ నుంచి 10 బస్సు సర్వీసులను ఈనెల 15 నుంచి నడిపిస్తామని మంథని ఆర్టీసీ డీఎం శ్రావణ్‌కుమార్ తెలిపారు. పుష్కరాలు జరిగే 12 రోజుల పాటు మంథని బస్టాండ్ నుంచి కాళేశ్వరానికి 30 నిమిషాలకు ఒక బస్సును నడిపించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మంథని నుంచి ఫుల్ టికెట్ రూ. 140 ఆఫ్‌టికెట్ రూ.70గా నిర్ణయించామని తెలిపారు.

కార్యకర్తను పరామర్శించిన వివేక్

ధర్మారం, మే 13 (ఆంధ్రజ్యోతి) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ కార్యకర్త పొన్నవేని స్వామిని చెన్నూర్ శాసనసభ్యులు గడ్డం వివేక్ పరామర్శించారు. స్వామి స్వగ్రామమైన గోపాల్‌రావుపేటకు వెళ్లిన వివేక్ అతని ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకున్నారు. కాడె సూర్యనారాయణ, దేవిజనార్దన్, పాలకుర్తి రాజేశం ఉన్నారు.

శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): పందిళ్ల గ్రామ శివాలయంలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిపారు. స్వామివార్లకు మహిళలు సారెచీర, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించారు. మాజీ సర్పంచ్‌లు అటికం శంకర్‌గౌడ్, దాసరిలావణ్య, మాజీ ఎంపీటీసీ రావి సదానందం పాల్గొన్నారు.

ఆలయ కరపత్రం ఆవిష్కరణ

పెద్దపల్లి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు జూన్ 2 నుంచి 6 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ సదయ్య, ఈవోశంకరయ్య తెలిపారు. మంగళవారం ఆలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు శ్రీకాంతాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారుల శిక్షణ శిబిరాలు



నిట్టూరులో ఖో ఖో శిబిరాన్ని ప్రారంభం

పెద్దపల్లి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకు శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూషణవేణి రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని నిట్టూరులో వేసవికాలంలో ఖోఖో శిక్షణ శిబిరం నిర్వహించగా ముఖ్య అతిథిగా రమేష్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్ స్కూళ్లు ప్రారంభించే ఉద్దేశ్యంతో విద్యార్థులు ఏ రంగంలో రాణించిన ప్రభుత్వం తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రాబోవు కాలంలో క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించి ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజయ్య, మాజీ సర్పంచ్ తోట శంకర్, ఫుట్ బాల్ వైస్ ప్రెసిడెంట్ తాండ్ర శంకర్, కబడ్డీ అర్గనైజింగ్ సెక్రటరీ తిరుపతిరావు, శిక్షకులు భాస్కర్, ఖాజా షఫీఉద్దీన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ఎన్టీపీసీ కేవీ విద్యార్థుల ప్రతిభ



అగసత్య శర్మ హ్రిశికేష్

జ్యోతినగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ 12, 10 తరగతి ఫలితాలలో ఎన్టీపీసీలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. రెండు తరగతులలో 100 శాతం ఫలితాలను ఎన్టీపీసీ కేవీ సాధించింది. 12వ తరగతి సైన్స్ విభాగంలో అగసత్య శర్మ 77.6 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. 10వ తరగతిలో ప్రద్యుమ్నరావు 79.2 శాతం (396 మార్కులు) మార్కులు సాధించి రెండవ టాపర్‌గా నిలిచారు. 12 వ తరగతి కామర్స్ విభాగంలో హ్రిశికేష్ 441 మార్కులతో 88.2 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచాడు. 10వ తరగతిలో 67 మంది పరీక్షలు రాయగా 100 శాతం ఫలితాలు సాధించారని కేంద్రీయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.శోభన్‌బాబు తెలిపారు.

రామగుండంలో కార్మికులపై వేధింపులు ఆపాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

కోల్‌సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు, సిబ్బందిపై అధికారుల వేధింపులు ఆపాలని, లేకపోతే నిరవధిక సమ్మె తప్పదని కార్మిక సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొన్నది. మంగళవారం కార్యాలయ ప్రాంగణంలో యూనియన్ ప్రతినిధులు కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. తొలగించిన రాజబాబు, వెంకటస్వామి సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకోవాలని, రాజీవ్ రహదారిపై మున్సిపల్ కార్మికులతో పని చేయించవద్దని కోరారు. వంద మంది కార్మికులకు బయోమెట్రిక్ సరిగా లేదనే సాకుతో రూ.4 లక్షల వేతనాలు కోత పెట్టారన్నారు. సొసైటీ నామినేటెడ్ అధ్యక్షుడిని తొలగించి ఎన్నికలు నిర్వహించాలని, కార్మికులను వేధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఇతర శాఖకు బదిలీ చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన కార్మికులకు డబ్బులు చెల్లించాలని, వయసు పైబడి అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలను ఇవ్వాలని, అధికారుల ఇండ్లలో పారిశుధ్య కార్మికులను పని చేయించవద్దని కోరారు. కార్మిక సంఘాల ప్రతినిధులకు, కమిషనర్, డిప్యూటీ కమిషనర్లకు వాడీవేడి చర్చ జరిగింది. త్వరలోనే రామగుండం ఎమ్మెల్యే, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళతామని వారు పేర్కొన్నారు.

లెజెండ్స్ క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

జ్యోతినగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లెజెండ్స్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ మంగళవారం రాత్రి ప్రారంభమైంది. ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు ఈనెల 18 వరకు లీగ్ పోటీలు, 19న ఫైనల్ పోటీ జరుగుతుంది. 40 ఏళ్లు పూర్తయిన ఉద్యోగులు పోటీల్లో పాల్గొంటారు. ఎన్టీపీసీ ప్రాజెక్టుకు చెందిన 5 జట్లు పాల్గొంటున్నాయి. జీఎంలు ఎ.కె.త్రిపాఠి, ముకుల్ రాయ్, విజయ్‌కుమార్ సిక్దర్, గణేశ్వర్ జాడి, రాజేశ్వర్, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలి

గోదావరిని, మే 13(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అనుబంధ కార్మిక సంఘాలు రాజకీయ ఎజండాతో టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చాయని, సింగరేణి కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలని బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్ ఇండియా, సింగరేణి కార్మికులకు సంబంధించిన హక్కులు, సంక్షేమం, రక్షణ, సదుపాయాలు, ఆర్థిక ప్రయోజనాలు ఏవీ సమ్మె డిమాండ్లలో లేవని, కేవలం కొన్ని పార్టీలకు లబ్ధి చేకూరేందుకే వాటి అనుబంధ కార్మిక సంఘాలు సమ్మెకు వెళ్తున్నట్టు సత్తయ్య తెలిపారు. పాకిస్థాన్‌తో మన దేశానికి మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నదని, ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో యావత్ దేశం ఒక్కతాటిపై నిలవాల్సిన అవసరం ఉన్నట్టు సత్తయ్య పేర్కొన్నారు. సంక్షోభ సమయంలో సమ్మెకు వెళ్ళడం ఆయా సంఘాల బాధ్యతారాహిత్యమని, అనేక హక్కులు కోల్పోతామని, పని గంటలు పెరుగుతాయని తప్పుడు ప్రచారం చేస్తూ కార్మికుల్లో అభద్రతా భావాన్ని ఆయా సంఘాలు సృష్టిస్తున్నట్టు సత్తయ్య పేర్కొన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించకుండా కార్మిక సంఘాలు సమ్మెను విరమించాలని, కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలని యాదగిరి సత్తయ్య కోరారు. ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి, సెక్రెటరీ ప్రమోద్ కౌశల్, నాయకులు వేణుగోపాల్‌రావు, సతీష్, నీలం రవి, గట్టు శ్రీనివాస్, నరేష్, శివాజీ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



శివపల్లిలో భూభారతి సదస్సులో ఆర్డీవో

ఎలిగేడు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి, లోకపేట్ గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య సందర్శించారు. ఆయన శివపల్లిలో మాట్లాడారు. రైతులు భూసమస్యలను పరిష్కరించడానికి భూభారతి చట్టంలో ప్రతీ సమస్యకు పరిష్కారం ఉందన్నారు. భూరికార్డులను పరిగణలోకి తీసుకొని ఫీల్డ్ ఎంక్వైరీ చేసి సమస్యలు వీలైనంత త్వరలో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు. మండలంలో ఈనెల 5 నుంచి ఇప్పటి వరకు 10 గ్రామాల్లో నిర్వహించిన భూభారతిలో రైతుల నుంచి 852 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. తహసీల్దార్ యాకన్న, డిప్యూటీ తహసీల్దార్‌లు కిరణ్‌కుమార్, తిరుపతి, ధీరజ్, ఆర్‌ఐలు జయలక్ష్మి, చంద్రశేఖర్, అనిల్, భూలక్ష్మి, రమ్య, స్వప్న పాల్గొన్నారు.



మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, మే 13 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం తలపెట్టిన జాబ్ మేళాను విజయవంతం చేయాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్జీ-1 కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 18న వంద కంపెనీలు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి రానున్నాయని, ఆర్జీ-1, 2, 3 ఏరియాలతో పాటు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి 10వేల మంది నిరుద్యోగులు ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొంటారని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, ఆర్జీ-1 కమ్యూనిటీహాల్‌ను ఎంపిక చేశామన్నారు. షామియానాలు, తాగునీరు, హెల్ప్‌డెస్క్ సెంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు, ఆంజనేయ ప్రసాద్, జితేందర్‌సింగ్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీ జీకేఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు మడ్డి ఎల్లయ్య, గుండేటి శ్రీనివాస్, మెండె శ్రీనివాస్, మిర్యాల రాజిరెడ్డి, విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 1ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, దీంతో కార్మిక వర్గానికి తీవ్ర నష్టమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతు న్నారని, కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని, సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి బీఎంఎస్ కుట్రలు చేస్తుందన్నారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రంగు శ్రీనివాస్, స్వామి, అశోక్, ఎంఎ గౌస్, శ్రీనివాస్, సారయ్య, నరహరి పాల్గొన్నారు.

సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 2ఏ గనిపై గేట్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికవర్గాన్ని కట్టుబానిసలుగా చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని, కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించు కున్న హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తుందన్నారు. ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో సింగ రేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఐ కృష్ణ, నరేష్, ఫయాజ్ బేగ్, సల్లా రవీందర్, ఈదునూరి నరేష్, రాజేశం, ప్రసాద్, కొమురయ్య, రవికుమార్, రాజబాబు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె బుక్‌లెట్ ఆవిష్కరణ

గోదావరిని, మే 13(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ప్రాధాన్యతను వివరించే బుక్‌లెట్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు మాట్లాడారు. ఏళ్ళ తరబడి దేశంలోని కార్మిక వర్గం అనేక ఉద్యమాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ఎన్‌డీఏ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా సవరించనున్నదని, దీని ద్వారా కార్మిక సంఘాలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. సమ్మె చేసే హక్కు, పని గంటలు పెరిగే అవకాశాలు ఉన్నట్టు ముత్యంరావు పేర్కొన్నారు. లేబర్ కోడ్‌ల సవరణ రద్దు చేయాలనే డిమాండ్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ ఆపాలనే డిమాండ్‌తో ఈనెల 20 తేదీన దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చినట్టు తెలిపారు. సమ్మె ఎందుకు అనే అంశంపై కార్మికులకు అవగాహన కలిగేలా బుక్‌లెట్‌నే రూపొందించినట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ వెంకన్న, నాయకులు సంపత్, వినేష్, శివకుమార్, సంతోష్, రాజేందర్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఏసీకి అనుమతి ఇవ్వండి

గోదావరిఖని, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 పరిధిలోని జీడీకే ఓసీపీ-5లో ఈపీ ఆపరేటర్ల రెస్ట్ రూమ్‌లో ఏసీ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని మంగళవారం ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు ప్రభుదాస్, ప్రసాద్, రాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉత్పత్తి నిలిపివేస్తాం

గోదావరిని, మే 13(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3లో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉత్పత్తిని అడ్డుకుంటామని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం ఐఎన్‌టీయూసీ బృందం ఓసీపీ-3లో పర్యటించింది. వేసవి ఉపశమని చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. యంత్రాల మరమ్మతు, డంప్ యార్డు, దుమ్ము నియంత్రణ చర్యలను పట్టించుకోవడం లేదన్నారు. జనరల్ సెక్రెటరీ అక్రం, నాయకులు సత్యనారాయణరెడ్డి, దశరథంగౌడ్, సంపత్‌రెడ్డి, మల్లేష్, పిట్ సెక్రెటరీ కొంగర రవీందర్, సమ్మయ్య, బర్ల రవీందర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఐఎన్‌టీయుసీ ఏజెండా

రామగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారమే ఐఎన్‌టీయుసీ ప్రధాన ఏజెండా అని ఐఎన్‌టీయుసీ సెంట్రల్ సీనియర్ ఉపాధ్యక్షుడు ధర్మపురి అన్నారు. మంగళవారం సెంటినరీకాలనీ ఐఎన్‌టీయుసీ భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికులు సమస్యల పరిష్కారానికి ఈ నెల 8న హైదరాబాద్‌లో కోర్‌కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సింగరేణి ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పాలని, యంత్రాల విడిభాగాల తయారీకి సింగరేణికి అనుబంధంగా కంపెనీలను ఏర్పాటు చేయాలని, కార్మికుల సొంతింటి కల, 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని జాతీయ అధ్యక్షుడు సంజీవ్‌రావు, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు వినతి పత్రాలను అందజేశామన్నారు. కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారానికి మంత్రులు సానూకులంగా స్పందించారని పేర్కొన్నారు. ఏఎల్‌పి గనిలో పనిచేసే వారిని సర్ఫేస్ బదిలి చేయకపోవడంతో మేనేజ్‌మెంట్‌తో చర్చించి 150 మంది జనరల్ అసిస్టెంట్‌లను ఓపెన్ కాస్టుకు బదిలి చేయించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు గడ్డం తిరుపతి, ఎల్లంకి రామారావు, ఉయ్యాల కుమారస్వామి, సదానందం, సమ్మయ్య, సాయి, కృష్ణ, దామోదర్‌రావు, రాజ్‌కుమార్, వెంకటస్వామి, కొమురయ్య, వెంకటేష్, మధు, సర్వన్, ప్రేమ్‌కుమార్, సదానందం, శ్రీనివాస్, తారాచంద్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయుసీ నేత ధర్మపురి